క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్, రూరల్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం పలు కాలనీలు, గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు శశిధర్‌రెడ్డి, పవన్‌చందు తెలిపారు.నూతన్‌కల్, కండ్లకోయ గ్రామాల పరిధిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


సూర్యప్రకాష్


మహేశ్వరి

మల్లాపూర్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు అండర్ 17 బాలుర విభాగంలో మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన వెంకట్ దుర్గ సూర్యప్రకాష్, అండర్ 17 బాలికల విభాగంలో మహేశ్వరి ఎంపికయ్యారు. వీరు వనపర్తి జిల్లా, సోలీపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడామైదానంలో జరగనున్న 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు.

జర్నలిస్టులు పోరాటాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న జర్నలిస్టు సంక్షేమ పోరాట కమిటీ సభ్యులు

గౌతంనగర్: జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మల్కాజిగిరి జర్నలిస్టు పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గౌతంనగర్ సంక్షేమ సంఘం భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పని చేస్తున్న ప్రాంతంలో ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. కుటుంబానికి ఆరోగ్య భద్రత, పిల్లలకు ఉన్నత ప్రమాణాలతో విద్య, గుర్తింపు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవి కొత్త కోరికలు కావని గతంలో పాలకులు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. దశాబ్దాలుగా మాయ మాటలతో పాలకులు జర్నలిస్టులను దగా చేస్తున్నారని పలువురు సీనియర్ విలేకర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా ఆచరణకు నోచుకోని హామీలపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

మాదిగల యుద్ధ భేరి సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

హబ్సిగూడ: నవంబర్ 5న ఇందిరా పార్క్ వద్ద మాదిగల యుద్ధ భేరి సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, మేడి పాపన్న మాదిగ తెలిపారు. ఆదివారం హబ్సిగూడ సుప్రభాత్ హోటల్‌లో ఎమ్మార్పీస్ రాష్ట్ర స్థాయి, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 25 శాతం సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్, గణేష్, శ్రీనివాస్, రమేష్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

మల్కాజిగిరి: రెండు పర్యాయాలు గెలిచిన కేసీఆర్ మాటలను నమ్మవద్దని తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఈ సారి ఎన్నికల్లో గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం ఓల్డ్ నేరేడ్‌మెట్‌లో పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను మార్చి ప్రకటించాడన్నారు. అర్హులందరికి పథకాలు అందాలన్నది కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, బీఆర్ఎస్ పార్టీ మాత్రం రాష్ట్రంలో కొందరికే పథకాలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు స్థానిక ముదిరాజ్,గౌడ కులస్తుల శ్మశానవాటిక సమస్యలతో పాటు పురాతన దేవాలయాల అభివృద్ధికి, మహిళా భవన్ ఏర్పాటుకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జీవన్‌సతీష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్,బి.కె.శ్రీను, శ్రీకాంత్‌ముదిరాజ్,సంపత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గులాబీనా...? కమలమా..?

- హరి అడుగులెటు..?
- అధ్యక్షుడిపై తీవ్ర అరోపణలు
- టికెట్ దక్కకపోవడంతో అనుచరుల నిరాశ

మేడ్చల్: కాంగ్రెస్ అసమ్మతి నేత సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పయనమెటు వైపో అనే అంశంపై మేడ్చల్ నియోజకవర్గంలో జోరుగా చర్చ జరుగుతోంది. మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ హరివర్ధన్‌రెడ్డి ఆదివారం తన అనుచరులతో సమావేశమై రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

◆ రాజకీయంగా ఒక చోట స్థిరంగా ఉండలేని హరివర్ధన్ రాష్ట్రంలోని అన్ని పార్టీల్లో చక్కర్లు కొట్టాడు. 1995లో యూత్ కాంగ్రెస్ నుంచి ప్రస్థానం ప్రారంభించిన ఆయన 1999 ఎన్నికల్లో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి ఉద్యమ నాయకుడిగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి 2004 లో పరిగి నుండి బీఆర్ఎస్ తరుపున పోటీ చేసి ఓటమి చవి చూశాడు. ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్ లో చేరి హబ్సిగూడ కార్పొరేటర్ గా విజయం సాధించి మేయర్ పదవి ఆశించాడు. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచి వైఎస్సార్ కాంగ్రెస్ లో చేరి ఉమ్మడి జిల్లా రాజకీయాలు నడిపించాడు. మారిన రాజకీయ పరిణామాలతో 2014లో టీడీపీలో, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరాడు. తాజా మూడు చింతపలపల్లి జెడ్పీటీసీగా కాంగ్రెస్ నుండి ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.


హరివర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్, బీజేపీ సంప్రదింపులు..

◆ అసమ్మతి నేతగా ఉన్న హరివర్ధన్‌రెడ్డి కి బీఆర్ఎస్, బీజేపీలు గాలం వేస్తున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌లో చేరితే జెడ్పీ చైర్మన్ పదవి ఇస్తామని మంత్రి మల్లారెడ్డి, ఇతర నాయకులు ఆఫర్ ఇస్తున్నట్లు సమాచారం. మంత్రి మల్లారెడ్డి స్వపక్షంలో అసమ్మతి నేతలుగా ఉన్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి చెక్ పెట్టేందుకు హరివర్ధన్‌ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని జెడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలని మంత్రి మల్లారెడ్డి రాజకీయం చేస్తున్నట్లు తెలిసింది.

◆ బీజేపీకి మేడ్చల్ లో బలమైన నాయకుడు లేకపోవడంతో హరివర్ధన్‌రెడ్డి తమ పార్టీలోకి వస్తే మేడ్చల్ టికెట్ కేటాయిస్తామని లేని పక్షంలో పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానం ఇస్తామని ఆ పార్టీ నాయకులు బేరాసారాలు మొదలు పెట్టారని సమాచారం.

◆ రాజకీయ నిలకడలేని హరివర్ధన్‌రెడ్డి అసమ్మతితో ఏ పార్టీలో చేరుతారోననే అంశంపై జోరుగా చర్చ జరుగుతోంది.

బయోడేటా.. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్



మేడ్చల్: మేడ్చల్ నుండి కాంగ్రెస్ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా తోటకూర వజ్రేష్ యాదవ్‌ను (జంగయ్య) పార్టీ అధిష్టానం ప్రకటించింది. మేడ్చల్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన నేతలు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లను కాదని అధిష్టానం వజ్రేష్ యాదవ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. వజ్రేష్ యాదవ్ ప్రొఫైల్.

పేరు: తోటకూర జంగయ్య యాదవ్ (వజ్రేష్ యాదవ్)గా పేరు మార్చుకున్నారు.
తల్లితండ్రులు: ఎల్లయ్య, ఎల్లమ్మ
సంతానం: ఇద్దరు కుమారులు. కుమార్తె పెద్ద కుమారుడు అజయ్ యాదవ్ బోడుప్పల్ కార్పొరేటర్
విద్యార్హత: 10వ తరగతి
నివాసం: బోడుప్పల్

రాజకీయ నేపథ్యం...

◆ టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ప్రజా రాజ్యం, టీడీపీ, ,కాంగ్రెస్ పార్టీల్లో పలు పదవులను నిర్వహించాడు. ఆయన భార్య లక్ష్మీ బోడుప్పల్ సర్పంచ్‌గా, ఆయన ఉపసర్పంచ్‌గా పని చేశారు.

రాజకీయ గురువులు: మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
వృత్తి ,వ్యాపారం: రియల్ ఎస్టేట్

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు


గుండ్లపోచంపల్లిలో కాంగ్రెస్ నేతల సంబరాలు

మేడ్చల్‌రూరల్: కాంగ్రెస్ తొలి జాబితాలో మేడ్చల్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ పేరు ప్రకటించడంతో గుండ్లపోచంపల్లిలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు బాణాసంచ పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటకూర వజ్రేష్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొంది మేడ్చల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి,మరీలమ్మ, కృష్ణారెడ్డి, సాయిపేట మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్‌లో మేరా మాటీ..మేరా దేశ్


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నా దేశం నా మట్టి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మట్టి సేకరించిన అనంతరం ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీన్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి అమర వీరుల స్మారక స్థూపం కోసం మట్టిని సేకరించడంలో భాగంగా యూనివర్సిటీలో మట్టిని సేకరించామన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ జెండాలు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్ పీఓలు నవీన్, మధుకర్, కిరణ్‌కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

పంతం నెగ్గించుకున్న మైనంపల్లి హన్మంతరావు

కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం

మల్కాజిగిరి: మల్కాజిగిరి అభ్యర్థిగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌ను మెదక్ అభ్యర్థిగా టికెట్లు కేటాయించడంతో మల్కాజిగిరి కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తన కుమారుడికి మెదక్ టికెట్ కోసం ప్రయత్నించిన మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో , ఆయన పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తనతో పాటు తన కుమారుడికి కూడా టికెట్ ఇప్పించుకుని తన పంతం నెరవేర్చుకున్నారు.

అన్ని వర్గాలకు ప్రాధాన్యం

అల్వాల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి నూతన మేనిఫెస్టోలో అన్ని వర్గాల ప్రజలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మర్రి రాజశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, వివిఎన్. రాజు, మలేష్‌గౌడ్, సంజీవరెడ్డి, చంద్రశేఖర్, మధు, వీణ మాధవి తదితరులు పాల్గొన్నారు.

రూ.11.55 లక్షల నగదు స్వాధీనం

మల్లాపూర్: ఎన్నికల నేపథ్యంలో నాచారం సీఐ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాచారం వీఎస్టీ కాలనీలో వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌లో తీసుకెళుతున్న రూ. 9.55 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అంబర్‌పేట్‌కు చెందిన బాలకృష్ణ ద్విచక్ర వాహనంలో నగదు తీసుకెళుతుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. పద్మారావునగర్‌కు చెందిన యమీన్‌ఖాన్ వద్ద రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్: సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా గాంధీనగర్ ప్రాంతానికి చెందిన పలాది విజయ్ నుంచి రూ. 3.5 లక్షలు, హయాత్‌నగర్‌కు చెందిన అనుగు కరుణాకర్ రెడ్డి వద్ద రూ. 4.28 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎన్నికల ప్రత్యేక బృందానికి అప్పగించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

మల్కాజిగిరి: రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మహబూబ్ నాయకులు సమ్మేళనం జరిగింది.ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు.ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకత తప్పదని, కాంగ్రెస్‌ను కూడా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల్లో ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, కర్నాటకు చెందిన మాజీ మంత్రి డాక్టర్ సుధాకర్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, సదానందగౌడ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆయన పలు డివిజన్లలో నిర్వహించిన గడప గడప కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీతో ప్రజల ముందుకు వస్తుందన్నారు. మల్లారెడ్డి మంత్రిగా ఉండి బోడుప్పల్ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకురాలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న హామీలన్నింటిని అమలు చేస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు.

త్రిపురసుందరి దేవిగా అమ్మవారు


బాలా త్రిపుర సుందరిదేవిగా గడిమైసమ్మ అమ్మవారు


స్వర్ణకవచ శివదుర్గాదేవి అలంకరణలో..

మేడ్చల్: దేవీ శన్నవరాత్రులు మేడ్చల్ పరిధిలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక గడిమైసమ్మ ఆలయంలో వందల మంది భక్తులు భవానీ దీక్షలు చేపట్టి నవరాత్రి పూజలు ప్రారంభించారు. వివిధ కాలనీల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. గౌడవెల్లి గుడిబండ ఆలయంలో, అత్వెల్లి త్రిపుర చాముండేశ్వరి ఆలయంలో ఘనంగా పూజలు ప్రారంభమయ్యాయి.ఆర్టీసీ కాలనీ కట్ట మైసమ్మ ఆలయంలో, రాఘవేంద్రనగర్ కాలనీల్లో హోమాలు నిర్వహించారు. తొలి రోజైన సోమవారం గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు.

కీసర గుట్టలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ భవానీ శివదుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం దేవాలయ మండపంలో గణపతి పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అమ్మవారి మొదటిరోజు అలంకరణ పూజలో ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ దంపతులు పాల్గొన్నారు. అమ్మవారు శ్రీ స్వర్ణకవచ శివదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


రాఘవేంద్ర కాలనీలో..

పోటీ పడి కాపీ కొట్టారు..


కొమ్మిడి శోభారాణి

ఘట్‌కేసర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ మేనిఫెస్టోలు చూస్తే దొందూ దొందేనని రుజువైందని, ఒకరి హామీలు మరొకరు పోటీపడి కాపీ కొట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొమ్మిడి శోభారాణి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామంటే, బీఆర్ఎస్ రూ. రూ. 3 వేలు ఇస్తామనడం, రూ. 5 వందలకు సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ చెప్పగా, తాము రూ. 4 వందలకే ఇస్తామని బీఆర్ఎస్, రూ. 4 వేల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ అంటే రూ. 6 వేలు ఇస్తామని బీఆర్ఎస్ అనడం, పంట రుణం రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటిస్తే రూ. 16 వేలు ఇస్తామని బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టడాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. తెలంగాణలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 400కు సిలిండర్ ఎందుకు ఇవ్వలేదని, హుజురాబాద్ ఎన్నికల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. అబద్ధపు హామీలిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మంచి చేసే నాయకుడిని ఎన్నుకోవాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఘట్‌కేసర్: భవిష్యత్తులో ప్రజలకు మంచి చేస్తాడనుకునే నాయకుడిని ఎన్నుకోవాలని ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ సార శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రసాదించిన ఓటు అనే ఆయుధాన్ని డబ్బు, మద్యానికి అమ్ముకోవద్దన్నారు. మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ నియోజకవర్గ బాధ్యుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ 2023 సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 65 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, అదే విధంగా బీసీ నాయకుడిని సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ రావు, బాలయ్య, రాజేశ్‌కుమార్, నర్సింహ్మా, పాండుగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి


చర్లపల్లిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ఆదివారం ఆమె బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతుగా చర్లపల్లి డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి బండారి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ రూపొందించిన మేనిఫెస్టో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, ప్రభుగౌడ్, ఆల్వా లక్ష్మారెడ్డి, సత్తెమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ కాంగ్రెస్‌లో ముసలం

- రాజీనామా బాటలో అసంతృప్తులు
- టికెట్ల కేటాయింపుపై తీవ్ర ఆగ్రహం
- రాష్ట్ర స్థాయి నేతలపై ఆగ్రహం

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీలో ముసలం పుట్టింది. నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నేతలు, సీనియర్ నాయకులు వేరువేరుగా రాజీనామాలు చేయడంతో పార్టీ మనుగడ అయోమయంగా మారింది. నిన్నటి వరకు ఎవరికి వారు ప్రచారాల్లో మునిగి తేలగా టికెట్ ప్రకటించడంతో టికెట్ రాని సీనియర్ నేతలు భగ్గుమన్నారు. క్రిమినల్ కేసుల్లో కూరుకు పోయిన వారికి టికెట్ ఎలా కేటాయిస్తారని ప్రశ్నించడంతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు అమ్ముడు పోయారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు నోటుకు సీటు దందా చేస్తున్నాడని సొంత పార్టీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఉప్పల్‌లో ఎలా తిరుగుతాడో చూస్తామంటూ హెచ్చరికలు సైతం జారీ చేస్తున్నారు. దశాబ్దాల తరబడి పార్టీకి సేవ చేస్తుమని నిన్న మొన్న పార్టీలోకి వచ్చి పదవులు అనుభవించడంతో పాటు సీట్ల దందా ప్రారంభించి పార్టీని మట్టు బెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి రాజీనామా చేసిన నాయకులు, నేతలు స్వంత అజెండాతో ముందుకు సాగాలని యోచిస్తున్నారు. ఎవరికి వారు స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలోకి దిగాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. కాగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ మేకల శివారెడ్డి అధిష్టానం తీరుపై భగ్గుమన్నారు. దశాబ్దాలుగా పార్టీకి పని చేసి పెద్ద దిక్కుగా ఉంటున్న నాయకులను పక్కన పెట్టిన అధిష్టానం కార్యకర్తలకు ఏమి సందేశాన్ని ఇస్తుందని ప్రశ్నించారు. ఇలా వ్యవహరిస్తే కార్యకర్తలు, యువకులు పార్టీకి ఎలా పని చేస్తారన్నారు. రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయి చేతలు ఇలా ఉండటం బాధాకరమన్నారు. తాను కూడా ఇక నుంచి పార్టీకి పని చేయనని సూచన ప్రాయంగా తెలిపారు.

కాలనీలను నిషేధిత జాబితాలో చేర్చొద్దు


సమావేశమైన కాలనీల ప్రతినిధులు

రామంతాపూర్ : పెద్ద చెరువు ఆక్రమణలపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు చెరువు బఫర్ జోన్‌లో ఉన్న సర్వే నెం.42, 43, 44 పార్ట్, 63 నుంచి 66, 30 సర్వే నెంబర్లలో ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను గుర్తించి ఈ ప్రాంతాల్లో ఎలాంటి భవన నిర్మాణాలు అనుమతులు, అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేయవద్దని జీహెచ్ఎంసీ ఇరిగేషన్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయా సర్వే నెంబర్ల పరిధిలోకి వచ్చే సాయి చిత్రానగర్, రవీంద్రనగర్, లక్ష్మీనగర్ కాలనీ, మహేశ్వరినగర్‌లో కాలనీ వాసులు స్థానిక వీరా రాజారెడ్డి పార్కులో సమావేశమయ్యారు. గతంలో తమకు గృహ నిర్మాణాలు, అపార్టుమెంట్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చి స్థలాలను నిషేధిత జాబితాలో చేర్చడంపై ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కాలనీల ప్రతినిధులు మాట్లాడుతూ త్వరలోనే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులను కలిసి తమకు జరుగుతున్న అన్యాయాలపై వినతి పత్రాలు అందజేస్తామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే న్యాయ పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు రుద్రశేఖర్, నాగేష్, కంచర్ల స్వామిరెడ్డి, మహేందర్ గుప్తా, రాఘవరెడ్డి, ఉపేందర్, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.